

# భూమి గుండ్రంగా ఉంది

—ఆనందరావ్ పట్నాయక్

హరిపురం మాధవయ్యకు, సుందరికి పెళ్లి అయింది. సంవత్సరం గడిచింది. మగపిల్లాడు పుట్టాడు. వాడి ఆట, పాటలతో జీవితం మధరంగా గడిచిపోయింది. మరికొన్నేళ్లకు ఆడపిల్ల పుట్టింది. ఇక ఆ దంపతుల ఆనందానికి అంతం లేకపోయింది. సుందరి మనస్సులో ఎన్నాళ్లుగా గూడుకట్టుకున్న కోరిక పాప పుట్టడంతో తీరిపోయింది. కళ్లకు కాటుక పెట్టి, బుగ్గన దిష్టిబొట్టు పెట్టి, కాళ్లకు గజ్జెలతో ఘల్లు, ఘల్లున పాప నట్టింటనడయాడుతుంటే అచ్చం ఆ చిన్నికృష్ణుడే గోపల్లె నుంచి వచ్చాడా అన్నట్లు వుండేది. మరి కొన్ని వసంతాలు మధురంగా గడిచాయి. పంట సరిగ్గా చేతికి రాకపోవడం మూలాన మాధవయ్య మనస్సుకి శాంతి కరవయింది. మనిషి చిక్కి శల్యమవడం ప్రారంభమైంది. అభం, శుభం ఎరుగని సుందరికి ఇవేమీ తెలియదు. ముప్పూటలా సుష్టుగా తిని దిలాషాగా తిరగడం, దాంతో కాస్త వళ్లు చేసిందేమో నిశ్చింతగా నిద్రపోయేది.

ఒకరోజు భూమిశిస్తు కట్టేందుకు పైకం సేకరించేందుకు మాధవయ్యకు చాలకష్టపడవలసి వచ్చింది. ఆలోచనలతో నిద్ర కరవయ్యింది. హఠాత్తుగా శబ్ధం విన్పించింది. ఏమిటా చప్పదు! ఇంట్లో ఎలకలు ఎక్కువయ్యినట్లు సుందరి ఫిర్యాదు చేస్తుండేది. చెవులు రిక్కించి విన్నాడు. ఎలుకలు లేవు. శబ్ధం లయ ప్రకారం అదేపనిగా రావడం విని కాస్త భయం వేసింది. తను ఇబ్బందుల్లో వున్నాడని ధనలక్ష్మి వస్తున్న సంకేతమా! లేక ఇనుప గజ్జెలతో ఘల్ ఘల్‌మంటూ జ్యేష్టాదేవి అడుగు పెడుతుందా! గుండెలు జలదరించాయి. భార్యను లేపుదామని సుందరీ...సుందరీ అని పిలిచాడు. "ఊఁ" అని మూలుగుతూ సుందరి లేచింది. అంతే శబ్ధం ఆగిపోయింది. ఆశ్చర్యం కొంత సేపటి వరకు చప్పళ్లు లేవు. కొన్ని నిముషాలు గడిచాయి.

మళ్లీ శబ్ధం. శంఖం సన్నగా వూదుతున్నట్లు, మధ్య మధ్యలో సముద్రపు హోరు, ఈసారి దీని అంతేమిటో తేల్చేద్దామనుకున్నాడు. మాధవయ్య పడకమీంచి లేచాడు. పంచె సవరించుకున్నాడు. తలుపు దగ్గరకు వెళ్లాడు. చెవి ఆన్చించి విన్నాడు. అక్కడేమీ అంతగా విన్పించడం లేదు. మంచం దగ్గరకు నడుచుకుంటూ వచ్చాడు. సుందరి వెల్లకిలా పడుకునివుంది. నోరు తెరుచుకుని వుంది. శబ్ధం ఆనోటి నుంచి విన్పడుతోంది. అంటే శ్రీమతివారి గురక అన్నమాట. సిరిరావడం...సింగినాదం ఏమీకావు.

మాధవయ్య మనస్సు కాస్తదిటవు పడింది. పడకేక్కాడు. ఎక్కడనుంచో వస్తున్నదనుకుంటున్న శబ్ధం ప్రక్కనే సుందరి నుండి రావడమని నిర్ధారణ కావడంతో మాధవయ్యకు నిద్ర కరవయింది. ఆ రాత్రంతా శివరాత్రి అయ్యింది. మర్నాడు ఎర్రటి కళ్లతో దిగాలుగా ఉన్న భర్తను చూసికూడ సుందరి ఏమీ అడక్కపోవడంతో మాధవయ్య ఉడికిపోయాడు. పగలు నిద్రపోయాడు.

సూర్యుడు ఏడు గుర్రాల రథంలో సంధ్య ఇంటికి చేరుకున్నాడు. చీకటి ముసురుకుంటుంది. పగలంతా పనిచేసి అలసిపోయి సుందరి మంచం ఎక్కగానే నిద్రాదేవి ఒడిలోకి వెళ్లిపోయింది. నిద్ర పట్టగానే గురక. పగలు నిద్రపోయిన మాధవయ్యకు గురక వినగానే కంపరం కలిగింది. ఆరోజు నిద్రకు నోచుకోలేకపోయాడు. రోజులు గడుస్తున్నాయి. మాధవయ్యకు దుర్భరంగా వుంది. తన మనస్సులోని వేదనను భార్యకు చెప్పలేక వ్యధచెందుతున్నాడు. పోనీ అలా అని సర్ది చెప్పకోలేక, నిద్రలేమితో మనిషి మరీ చిక్కి బ్రతికిన శవంలా తయారయ్యాడు.

ఒక శుభముహూర్తాన ఒక నిర్ణయానికి వచ్చాడు. మాధవయ్య కొడుకు చేతికందుకొచ్చాడు. ఆడపిల్లకు పుట్టినప్పటినుండి ఇది మాకోడలు అని ముద్రవేసింది తోబుట్టువు. ఇకపోతే సుందరి పిల్లలిద్దరికీ పెళ్లచేసేసి మనవలు, మనవరాండ్రుతో కాలం నెట్టేస్తుంది. ఇక తాను హిమాలయాలకు పోవడం వుత్తమం. ఎవ్వరికీ చెప్పాపెట్టకుండా ఒక రాత్రి మూటతో బయల్దేరాడు మాధవయ్య. పగలంతా నడిచి నడిచి సిరిపురం చేరుకున్నాడతను. మూటలో వున్న అటుకులు, బెల్లం అయిపోవచ్చాయి. మనిషి అలసటతో, ఆకలితో వకనకలాడిపోతున్నాడు. హఠాత్తుగా మాధవయ్యకు గుర్తుకు వచ్చింది. సిరిపురంలో తనతోబుట్టువు వున్నట్లు, ఆరాత్రి అక్కడ గడిపి మర్నాడు వెళ్లిపోదామనుకున్నాడు. అన్నను చూడగానే అన్నపూర్ణ మనస్సు ఆనందంతో నిండిపోయింది. విందు భోజనం పెట్టి పడక ఏర్పాట్లు చేసింది. పడక




ఎక్కగానే నిద్రపోయాడు మాధవయ్య. అర్ధరాత్రి వేళ లఘుశంక కోసం లేచాడు. కొంత సేపవ్వగానే పందికొక్కుల పోరాటం ఉధృతంగా సాగుతున్న వైనం విన్నాడు. మర్నాడు వెళ్లబోయేముందు బావతో చెప్పి పందికొక్కులకు మందు పెట్టించి చంపించేటట్టు చూడాలనుకున్నాడు. రాను రాను ఆ గొడవ ఎక్కువవుతోంది. ఇక లాభంలేదని కర్రపట్టుకుని వంటింట్లోకి దూరాడు. అక్కడేవీ లేవు. లోనికి రావడానికి కలుగులు అంగాలేవు. అయితే ఆ శబ్దాలు మరోగదిలోంచి వస్తునట్లు కనుక్కున్నాడు. తలుపులు నెట్టిచూస్తే బావ, చెల్లెలు పడుకుని వున్నారు. ఆశబ్ధాలు చెల్లెలు గురకని అర్ధం చేసుకున్నాడు. కొన్ని ఏళ్లగా ఆ శబ్ధానికి అలవాటుపడ్డ బావకి జోహార్లు అర్పించి, మూటతో బయల్దేరాడు. ఆ అపరాత్రివేళ మాధవయ్య.

కొన్ని యోజనాలు నడిచేసరికి ఆయాసం వచ్చింది మాధవయ్యకు. మరికాలు ముందుకు సాగడం లేదు. శరీరం చెప్పిన మాటవినడంలేదు. ఒక ఊరుచేరుకున్నాడు. పూటకూలమ్మ ఇంట్లో మకాం వేసాడు ఆరాత్రి. పంచభక్ష్య పరమాన్నాలు పెట్టకపోయినా ముసలవ్వ వండిపెట్టిన అన్నం, పప్పు కందిపచ్చడి ఆబగా తిన్నాడు. నిద్రాదేవి ఆహ్వానిస్తోంది. అరుగు మీదనే అలా నిద్రపోయాడు. రాత్రి నిద్రవిరిగింది. దశమినాటి చంద్రుడు, చుక్కలతో సరాగాలాడుతున్నాడు. విమానం వస్తున్నట్లు వుంది. తనని చూసిన దేవతలు వెనక్కు పోతారేమోనని, తలువు వారగా నక్కికూర్చున్నాడు మాధవయ్య. విమానం మోత ఇంకా దగ్గర అయినట్లుంది. పక్షులు కువకువలు కట్టిపెట్టినాయి. ఆకులు అల్లాడటంలేదు. ఎంత సేపయినా విమానం జాడలేదు. మెడ సాగదీసి ఆకాశంవైపు చూసాడు. విశాలమైన ఆకాశాన ఆఛాయె లేదు. కాని శబ్దం మాత్రం ఆగలేదు. ఈసారి మెదడుకి మేత కల్పించి చూసాడు. తలుపులు నెట్టాడు. పూటకూలవ్వా? ఏమిటి? ప్రక్కనే తొంభైయేళ్ల వాళ్లాయిన ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. నోరు తెరచి వెల్లకిలా పూటకూలవ్వ. విమానం మోత ఆనోటినుంచి వస్తోంది. ఒక్క క్షణం వృధాచెయ్యలేదు మాధవయ్య గబాగబా నడచి ముందుకు సాగాడు.

ఎట్టకేలకు హిమాలయాలు చేరుకున్నాడు. గలగలాపారె గంగ, దూరాన వెండి కొండలు, శివుడు–పార్వతి నర్తన మాడిన నాట్యశాలది. ఇక్కడ జీవితాంతం గడిపి తనువు చాలించాలనుకున్నాడు మాధవయ్య. ఎన్నో ఆశ్రమాలు. ఒక ఆశ్రమంలో చేరాడు. కాషాయవస్త్రాలలో సంత్, సాధువులు నడిచివచ్చిన నారాయణమూర్తుల్లా వున్నారు. చిరునవ్వు ఆభరణంగా సాధుమహారాజ్ ఎన్నాళ్లుగా అక్కడవున్నాడో ఎవరికి తెలియదు. బహుశా ఆయనకు ఐదువందల ఏండ్లు వుండొచ్చునని ప్రజల నమ్మకం. పగలు తోటపని, భజనతో కాలం గడిపి, పళ్లు పాలు సేవించి కటిక నేలమీద పడుకున్నాడు మాధవయ్య. గాఢంగా నిద్రపోతున్నవాడు భయంగా బయటకు పరుగెత్తుకొచ్చాడు. కొండచరియవిరిగి, భూకంపం వచ్చి యీ ఆశ్రమంనేలకూలలేదేమిక్రి చెప్మా అని ఆశ్చర్యపోయాడు. మరో పెద్దవింత. ఆశ్రమవాసులు ఎవ్వరూ లేవలేదు. అంతానిశ్చింతగా నిద్రపోతున్నారు. మాధవయ్య తల విదిలించి చూసాడు. కొండ విరగలేదు. భూమి చిట్లలేదు. కాని వుండుండి విపరీతమైన ప్రకంపనతో కూడుకున్న విస్ఫోటకం. ఆశ్రయంలో అడుగు పెట్టిన మాధవయ్య సందేహాలకు సమాధానం దొరికింది. అది సాధుమహారాజ్ గురక. సరిపోయింది. ఇక్కడా తప్పిందికాదు గురక ప్రమాదం.

పందికొక్కు పోట్లాట, విమానం మోత, భూకంపం లాంటి గురకులున్న శంఖం వూదిన సన్నని గురక నయం. కొన్ని దశాబ్దాలుగా భర్తలు, భక్తులు భరించగాలేనిది తనుమాత్రం ఎందుకు పారిపోయిరావాలి. తన సుందరి, పిల్లలు, పొలం, వూరు గుర్తుకొచ్చాయి మాధవయ్యకు. హరిపురంలో మంచి భర్తగా, మంచి తండ్రిగా పేరుతెచ్చుకున్నాడు హుషారైన మాధవయ్య. ●



## ఆమె

చూపుల చురకలతో
నా హృదయాన్ని వీల్చు
ప్రేమనదినై ప్రవహిస్తాను!
నీ పాదపద్మాలను ప్రక్షాలిస్తాను!!

ఫాలంమీద
పాడ్యమి నెలవంకల నద్దుతావు..
ఆనంద కైలాసంలో
అర్ధనారీశ్వరుణ్ణవుతాను!

ప్రేమ–ద్వేషం
కవలలు!
అనురాగం–క్రోధం
వాటి వలువలు!!

చేలు సరే.. వూలు సరే...
చెలి ఏదీ ప్రక్కన?
ఏకాంతం ఎందుకు మరి
చేత్పుకోంది అక్కున??

–బి.వి.రామిరెడ్డి

నిన్నటితరం
మహారచయిత్రి
'లత'



నేటి తరం
దార్శనికురాలు
'లత'

రేపటి తరానికి
అందిస్తున్న
కానుక
వివరాలకు
వచ్చే సంచిక చూడండి!